క్లుప్తంగా

గ్రీవెన్స్‌కు 8 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో అఖిల

రామచంద్రపురం: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం గ్రీవెన్స్ కార్యక్రమంలో మొత్తం 8 అర్జీలు స్వీకరించినట్టు ఆర్డీవో డి.అఖిల స్థానిక విలేకరులకు తెలిపారు. దారిని పాడు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టులపై దాడులు అరికట్టేలా చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ భూమిని ఆన్‌లైన్‌లో పేరు మార్పు చేయాలని అర్జీలు అందన్నాయన్నారు. గ్రామ సేవకులు న్యాయమైన కోరికలు పరిష్కరించాలని, రీ సర్వేలో తప్పులు సరిచేయాలని 2, పంచాయతీ నిధులు దుర్వినియోగంపై 2 చొప్పున అర్జీలు అందగా వాటి పరిష్కారానికి ఆయా శాఖలకు బదిలీ చేసినట్టు ఆర్డీవో పేర్కొన్నారు.

గురుకుల వసతి గృహంలో మలేరియా అధికారి తనిఖీ



వసతి గృహాన్ని తనిఖీ చేస్తున్న మలేరియా అధికారి వెంకటేశ్వరరావు తదితరులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ పరిధిలోని ఆదివారపుపేట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల వసతి గృహాన్ని సోమవారం జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు ఆకస్మిక తనిఖీ చేపట్టారు. హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం సబ్ యూనిట్ అధికారి యాతం నాగబాబు ఆధ్వర్యంలో వసతి గృహంలో దోమల బెడద లేకుండా ఏసీఎం 5శాతం మందును ప్రత్యేక పరికరాలతో పిచికారీ చేయించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, డార్మెటరీ గదులకు దోమతెరలు ఉపయోగించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో యూనిట్ అధికారి రాజబాబు, పీహెచ్‌సీ ఏఎన్ఎం, ఎంపీహెచ్ఏలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలు గుర్తింపునిస్తాయి

కపిలేశ్వరపురం (మండపేట): పంచాయతీరాజ్ శాఖలో 42 సంవత్సరాలు పాటు సేవలందించిన ఉద్యోగ విరమణ చేసిన ఏఈఈ దేవరపల్లి వీరరాఘవులు సోమవారం పదవీ విరమణ పొందారు. దంపతులను మండపేటలో జరిగిన ఉద్యోగ విరమరణ సత్కార కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట, ఎమ్మెల్యే జోగేశ్వరరావు, చైర్‌పర్సన్ నూక దుర్గారాణి, పంచాయతీరాజ్ శాఖ అమలాపురం ఈఈ పి.రామకృష్ణారెడ్డి సత్కరించారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన అభివృద్ధి పనులను ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ పూర్తి చేశారన్నారు.

షట్టర్లు బద్దలుగొట్టి చోరీ



పట్టణంలోని మందుల షాపులో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణం బస్ స్టాండ్ దగ్గర ఉన్న బాలాజీ మొబైల్స్, శ్రీనివాస మెడికల్ షాప్‌లలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. సోమవారం ఉదయం దుకాణాలు తెరిచేందుకు రాగా చోరీకి పాల్పడ్డట్టు గుర్తించారు. షట్టర్లు బద్దలు గొట్టి మెడికల్ షాపులోని ల్యాప్‌టాప్, నగదు చోరీ చేశారు. మొబైల్ షాపులో వినియోగదారులు మరమ్మతు కోసం ఇచ్చిన సెల్‌ఫోన్లు చోరీకి పాల్పడ్డారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో క్లూస్ టీం ఘటనా స్థలానికి చేరుకుని తనిఖీ చేశారు. దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

స్వయం ఉపాధి మార్గాలను అన్వేషించాలి



మెప్మా ఉత్పత్తుల విక్రయ కేంద్రాన్ని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

కపిలేశ్వరపురం (మండపేట): పట్టణ ప్రాంతాల్లో మహిళలు తమ శక్తి సామర్థ్యాలతో స్వయం ఉపాధి మార్గాలను అన్వేషించడం ద్వారా వారి కుటుంబాల్లో ఆర్థిక స్థిరత్వం కలుగుతుందని చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. శిబిరంలో మహిళా సంఘాలు స్వయంశక్తితో తయారు చేసిన ఉత్పత్తులను విక్రయాలకు ప్రదర్శించారు.

జిందాల్‌తో మున్సిపాలిటీపై భారం

- పలు అభివృద్ధి పనులకు ఆమోదం
- 11వ అజెండా అంశంపై చర్చ
- ఆర్థిక భారంపై కౌన్సిల్‌లో సభ్యుల ఆవేదన
- వాడీవేడిగా మున్సిపల్ సమావేశం



కౌన్సిల్‌లో కమిషనర్‌ను ప్రశ్నిస్తున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ శ్రీనివాస్



సమావేశం నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

కపిలేశ్వరపురం (మండపేట): వైజాగ్, గుంటూరులో నిర్వహణలో ఉన్న జిందాల్ ప్లాంట్‌కు మండపేట మున్సిపాలిటీ నుంచి చెత్తను తరలించేందుకు అవసరమైన భారీ వాహనం, పరికరాలను మున్సిపాలిటీ సమకూర్చుకోవాలన్న ప్రతిపాదన సరైందికాదని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు అన్నారు. పారిశుధ్య పరిరక్షణ పేరుతో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ నిర్ణయం వల్ల మున్సిపాలిటీపై ఆర్థిక భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మండపేట మున్సిపల్ సమావేశ మందిరంలో సోమవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో అజెండా వివరాలను కమిషనర్ టీవీ రంగారావు ప్రవేశపెట్టారు. ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు హాజరయ్యారు. అంశాల వారీగా చైర్‌పర్సన్ దుర్గారాణి సమావేశాన్ని కొనసాగించారు.

జిందాల్‌తో భారం

మున్సిపాలిటీ పరిధిలో రోజుకు సుమారు 36 టన్నుల చెత్త ఉత్పత్తవుతుందని, ఇక నుంచి ఆ చెత్తను స్థానికంగా డంప్ చేసేందుకు వీలు లేదని, ఏ రోజుకు ఆరోజు భారీ లారీలో విశాఖపట్టణం, లేదా గుంటూరులోని చెత్త నుంచి విద్యుత్‌ను తయారు చేసే జిందాల్ ప్లాంట్‌కు మున్సిపాలిటీ పరిధిలోని చెత్తను తరలించేందుకు రూ.26 లక్షల వ్యయంతో భారీ వాహనాన్ని కొనుగోలు చేయాలంటూ రూపొందించిన 11వ అజెండా అంశంపై కౌన్సిల్‌లో కమిషనర్ టీవీ రంగారావు, కౌన్సిలర్లు మధ్య తీవ్ర స్థాయిలో చర్చ జరిగింది. కమిషనర్ మాట్లాడుతూ రూ.95 లక్షల వ్యాక్యూమ్ తరహా రోడ్డు స్వీపింగ్ మెషీన్‌ను కొనుగోలుకు రూ.55,52,630 స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు చెల్లించాలన్నారు. దీనిపై చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి మాట్లాడుతూ ఇంత భారీ మొత్తంలో వాహనాలను కొనుగోలు చేయడం వల్ల మున్సిపాలిటీకి ఏమైనా ప్రయోజనం ఉంటుందా అని ఆరా తీయడంతో కమిషనర్ మౌనం పాటించారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు పిల్లి శ్రీనివాస్, మందపల్లి రవికుమార్ మాట్లాడుతూ మున్సిపాలిటీపై భారం పడే ఖర్చులు సరికాదన్నారు. పిల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ రామచంద్రపురం మున్సిపాలిటీలో ఇటీవల స్థానికంగా ఏర్పాటు చేసిన ప్లాంట్ సమస్యలతో నడుస్తుందని, అదే పరిస్థితి తలెత్తే అవకాశాలుంటాయని సూచించారు.

ఆధార్ శిబిరాలపై అవగాహన

ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ మున్సిపల్ నిధులను శాస్త్రీయంగా ఆలోచన చేసి ఖర్చు చేయాలని, వాక్యూమ్ తరహా స్వీపింగ్ మెషీన్ కొనుగోలు వల్ల కలిగే ప్రయోజనాలను అంచనా వేశాకా నిర్ణయం తీసుకోవడం మంచిదన్నారు. ఆధార్ నవీకరణకై స్థానికంగా ఉన్న యూనియన్ బ్యాంకుకు అత్యధికంగా ప్రజలు వెళ్తుండటంతో ఇతర శిబిరాలు సైతం నిర్వహణలో ఉన్నాయన్న విషయంపై ప్రచారం చేయాలని నిర్ణయించారు. వైఎస్సార్ పార్క్ వద్ద వాటర్ ట్యాంక్ డోమ్ మరమ్మతు పనులు జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజు ప్రజలు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారని కమిషనర్‌ను నిలదీశారు. కాంట్రాక్టర్‌ను నెల రోజుల్లో పూర్తి చేసి అప్పగించేలా వ్రాతపూర్వక హామీని తీసుకోవాలని సూచించారు. పట్టణంలో కళావిహీనంగా ఉన్న ప్రభుత్వ భవనాలు, పార్కులు తదితర గోడలను సుందరీకరిస్తూ రంగులు వేసేందుకు నిధులను రూ.4 లక్షలకు పెంచారు. కేపీరోడ్డులో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ను తొలగించడంతో రూ.8 లక్షలతో పింక్ టాయిలెట్స్ నిర్మాణం చేపట్టేందుకు డోనర్‌ను చూడాలని, ఆ నిధులను మరో పనికి ఖర్చు చేయవచ్చని సూచించడంతో కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

ఆమోదించిన తీర్మాణాలిలా..

28వ వార్డు 13వ సచివాలయం పరిధిలో రజకుల చెరువు, ధోభి ఘాట్ వద్ద బట్టలు ఆరబెట్టుకొనేందుకు రూ. 5,51,656 అంచనా విలువతో జీఐ షీట్ షెడ్ నిర్మాణం చేపట్టేందుకు తీర్మాణం. 29వ వార్డు విక్టరీ బజార్ సమీపంలో రూ.5,38,724 అంచనా విలువతో సీసీ రోడ్డు నిర్మాణం చేయనున్నారు. 8వ వార్డు దేవాంగుల స్మశాన వాటికకు ఈశాన్యం వైపు రూ. 3,10,650 అంచనా వ్యయంతో ప్రహరీ గోడ నిర్మాణం చేయనున్నారు. 9వ వార్డు రజక కమ్యూనిటీ హాలుకు రూ. 3,83,936 వ్యయంతో అదనపు వసతులు కల్పించనున్నారు. 6వ వార్డులోని ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ శిథిల స్థితికి చేరిన నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా రూ.2.95 కోట్ల అంచనాతో నూతన ట్యాంక్ నిర్మాణానికి ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించేందుకు తీర్మాణం. హెడ్ వాటర్ వర్క్స్ నందు రూ.3.75 కోట్లతో 1000 కేఎల్ సామర్థ్యగల వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళనున్నారు. ఎస్‌డబ్ల్యూఎం సెక్టార్ రూ.29,32,500 తో తడి వ్యర్థాల నిర్వహణ, రూ.28,80,291తో ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ మొత్తం రూ.58,12,791 కేటాయించేందుకు తీర్మాణం చేశారు. హెడ్ వాటర్ వర్క్స్ నందు 33.11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ వద్దకు రూ.18,85 లక్షలతో గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేయనున్నారు. రూ.2 లక్షలతో పట్టణంలోని వార్డుల్లో అవుట్‌పాల్ డ్రైన్‌లలో సిల్టును తీయుట, గుర్రపుడెక్కను తొలగింపు పనులు చేపట్టనున్నారు. వైఎస్సార్ పార్కు వద్ద ఉన్న జాతీయ బోధ వ్యాధి నివారణ కేంద్రం శిథిలావస్థకు చేరిన నేపథ్యంలో సమీపంలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ మొదటి అంతస్థులో ఖాళీగా ఉన్న 1వ నంబర్ షాపులోనికి తాత్కాలికంగా మార్చటానికి నిర్ణయించారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు



ఉద్యోగ విరమణ చేసిన తులసీదాస్‌ను సత్కరిస్తున్న డీవైఈవో తదితరులు

రాయవరం: వృత్తి పట్ల నిబద్ధత, అంకితభావంతో కూడిన సేవలు కలకాలం నిలిచి ఉంటాయని రామచంద్రపురం ఉప విద్యాశాఖాధికారి పి.రామలక్ష్మణ మూర్తి పేర్కొన్నారు. 41 సంవత్సరాలు విధులు నిర్వర్తించి చేసి వెంటూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉద్యోగ విరమణ చేసిన సోషల్ ఉపాధ్యాయుడు టి.తులసీదాస్ వీడ్కోలు సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాఠశాల హెచ్ఎం డి.సత్తిరాజు అధ్యక్షతన జరిగిన సత్కార సభలో డీవైఈవో మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసే వారికి గుర్తింపు దానికదే వస్తుందన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ చేసిన ఆయనను ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో దుశ్శాలువా, పూల మాలలు, జ్ఞాపికతో సత్కరించారు. అనంతరం పసలపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఎన్.గోవిందరాజును హెచ్ఎం నూలు ఆదినారాయణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

దళిత నాయకుడి మృతి

కె.గంగవరం: నియోజకవర్గ మాలమహానాడు నాయకుడు, మాజీ ఎంపీటీసీ, వైఎస్సార్ సీపీ దళిత నాయకులు, కె.గంగవరం గ్రామ సర్పంచ్ కోటి లక్ష్మీ నరసమ్మ భర్త కోటి వెంకట్రావు అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆయన గతంలో ఎంపీటీసీగా, కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా, వైఎస్సార్‌సీపీ దళిత నాయకుడిగా సుదీర్ఘ కాలం ఎన్నో సేవలు అందించారు. ఆయన పార్థివ దేహాన్ని రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, నియోజకవర్గ శెట్టిబలిజ నాయకులు నరాల ఏడుకొండలు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, మాజీ రాష్ట్ర మాజీ ఇండస్ట్రీయల్ కార్పొరేషన్ డైరెక్టర్ వాసంశెట్టి శ్యాం, ఎంపీపీ పెట్టా శ్రీనివాస్, ఎంపీపీ పంపన నాగమణి, బీసీ నాయకులు పంపన సుబ్బారావు, ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ రవ్వా భూషణం, మాజీ సర్పంచ్‌లు, దళిత నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు సందర్శించి నివాళులు అర్పించారు.

ఘనంగా నగరోత్సవం



స్వామివారి నగరోత్సవం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ ప్రసన్నాంజనేయ స్వామివారి ఆలయం వద్ద జరుగుతున్న సప్తహ మహోత్సవాల్లో భాగంగా నాలుగో వారం పూర్తయిన సందర్భంగా స్వామివారి నగరోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ద్రాక్షారామ వేలంపాలెం పురవీధుల్లో ఉష్ణవాహనంపై ఊరేగించారు. పురవీధుల్లో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భీమవరం నుంచి వచ్చిన కోలాట బృందం నృత్యం ఆకట్టుకుంది

ఇసుక తవ్వితే కఠిన చర్యలు

- ర్యాంపుల్లో జాయింట్ కలెక్టర్ తనిఖీలు
- అక్టోబర్ 15 వరకూ ర్యాంపుల మూసివేత



కపిలేశ్వరపురం ర్యాంపులో ఇసుక నిల్వలను పరిశీలిస్తున్న జేసీ నిషాంతి

కపిలేశ్వరపురం: జిల్లాలోని ర్యాంపుల్లో ఇసుక అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సోమవారం హెచ్చరించారు. అన్ని ప్రాంతాల్లోనూ ఇసుక తవ్వకాలపై పటిష్ట విజిలెన్స్ వ్యవస్థతో నిఘా కొనసాగుతుందని, నదీ గర్భంలో ఇసుకను అక్రమంగా తరలించేవారిపై చట్ట పరిధిలో చర్యలు తప్పవన్నారు. పర్యావరణ నిబంధనల మేరకు జూన్ 1 నుంచి అక్టోబర్ 15 వరకూ నదీ గర్భంలో ఇసుక తవ్వకాలను నిలిపివేశామన్నారు. ఇప్పటికే పలు చోట్ల ఉంచిన నిల్వ కేంద్రాల నుంచి మాత్రమే ఇసుకను తరలించేందుకు అనుమతులున్నాయన్నారు. గోదావరిలో తవ్వకాలకు అనుమతులు లేవన్నారు. ర్యాంపులలోకి వాహనాలు వెళ్లకుండా ర్యాంపుల మార్గాలను మే 31న మూసివేశామన్నారు.

కపిలేశ్వరపురం, తాతపూడిలో తనిఖీలు..

కపిలేశ్వరపురం, తాతపూడి ర్యాంపులను జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి రీజనల్ విజిలెన్స్ బృందంతో కలిసి సోమవారం తనిఖీ చేశారు. ఆయా ర్యాంపుల పరిధిలోని నదీ గర్భంలో తవ్విన ఇసుక, నిల్వ కేంద్రాల్లో ఉంచిన ఇసుక నిల్వలపై అధికారులను ఆరా తీసి రికార్డులను తనిఖీ చేశారు. నిర్దేశించిన గడువు ముగియకుండా ఇసుకను తవ్వితే కఠిన చర్యలు తప్పవని సంబంధిత అధికారులను హెచ్చరించారు. అందుకు తగిన చర్యలను చేపట్టాలని, నిరంతరం నిఘా కొనసాగించాలని ఆదేశించారు. ఆమె వెంట జిల్లా భూగర్భ గనుల శాఖ సహాయ సంచాలకులు ఎల్.వంశీధర్ రెడ్డి, రామచంద్రపురం ఆర్డీఓ డి.అఖిల, కపిలేశ్వరపురం తహసీల్దార్ డి.శ్రీనివాస్, రీజనల్ విజిలెన్స్ ఏలూరు బృందం ఏజీ కిశోర్‌బాబు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ ఉన్నారు.

అబద్ధాలతో ఎల్లకాలం మోసం చేయలేరు

కాజులూరు: కూటమి నాయకులు కల్లబొల్లి మాటలు చెబుతూ అబద్ధాలతో ప్రజలను ఎల్లకాలం మోసం చేయలేరని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ బీసీ సెల్ కన్వీనర్ పితాని సుబ్రహ్మణ్యం అన్నారు. గొల్లపాలెంలో సోమవారం పార్టీ మండల శాఖ అధ్యక్షుడు పిల్లి కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో సూపర్‌సిక్స్ పేరుతో తప్పుడు వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన తెలుగుదేశం నాయకులు వాటిని అమలు చేయలేక అబద్ధాలు చెబుతూ ప్రజలను మభ్యపెడుతున్నారని వారికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. మంగళవారం దుగ్గుదుర్రులో రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పార్టీ యువజన విభాగ అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో జరిగే పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షుడు మాదిరెడ్డి ప్రుద్వీరాజ్, మండల బీసీ సెల్ కన్వీనర్ చొల్లంగి వెంకటరమణ, మంజేరు సర్పంచ్ గుంటూరు అప్పారావు, ఎంపీటీసీ జొన్నకూటి వెంకటేశ్వర్రావు, యాళ్ల సత్తిబాబు, పోతురాజు బాబూరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అనుబంధ సంఘాల నాయకులు

రామ్మోహన్‌రావు అందరికీ ఆదర్శనీయులు



రామ్మోహన్ రావు దంపతులను సన్మానిస్తున్న ఎంపీపీ నాగమణి తదితరులు

కె.గంగవరం: ఉపాధ్యాయ వృత్తిలో చిట్టూరి రామ్మోహన్‌రావు చేసిన సేవలు ఉపాధ్యాయులందరికి ఆదర్శనీయమని ఎంపీపీ పంపన నాగమణి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు కొనియాడారు. మండల పరిధిలోని కూళ్ల ఉన్నత పాఠశాలలో సోమవారం పదవీ విరమణ చేసిన చిట్టూరి రామోహనరావును పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, సహచర ఉపాధ్యాయులు ఘనంగా సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పంపన నాగమణి మాట్లాడుతూ చిట్టూరి రామమోహన్ రావు ఉపాధ్యాయ వృత్తిలో గల 36 సంవత్సరాలు ఎన్నో సేవలు అందించారన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంతో పాటు ఎన్నో ప్రజా సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆయన సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆయురారోగ్యాలతో ఉండాలని ఆమె కోరారు. అనంతరం పలువురు రామమోహన్ రావు దంపతులను శాలువాలు, పూలదండలు, మోమెంటోలతో ఘనంగా సత్కరించారు.

రంగనాయకులు సేవలు అభినందనీయం



రంగనాయకులు దంపతులను సత్కరిస్తున్న ఆలయ ఈఓ వెంకటదుర్గా భవాని, సిబ్బంది

రామచంద్రపురం రూరల్: దేవదాయ ధర్మదాయ శాఖలో 28 సంవత్సరాల పాటు కామిరెడ్డి రంగనాయకులు ఉత్తమ సేవలు అందించారని ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి అల్లు వెంకటదుర్గా భవాని అన్నారు. భీమేశ్వరస్వామి వారి దేవస్థానంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కామిరెడ్డి రంగనాయకులు సోమవారం పదవి వీరమణ అభినందన సభను ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. ఆలయ ఉద్యోగులు, సిబ్బంది రంగనాయకులు దంపతులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రంగనాయకులు దేవదాయ ధర్మదాయ శాఖలో సుదీర్ఘ కాలం పాటు వివిధ హోదాలో పని చేశారన్నారు. అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో శిక్షణ కార్యక్రమం



శిక్షణలో పాల్గొన్న స్టాఫ్ నర్సులతో డాక్టర్ ప్రవీణ్ తదితర వైద్య సిబ్బంది

రామచంద్రపురం: స్థానిక ఏరియా ఆసుపత్రిలో రామచంద్రపురం డివిజన్ పరిధిలోని 13 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్టాఫ్ నర్స్‌లకు జాతీయ వయోవృద్ధుల ఆరోగ్య సంరక్షణ, జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమం, ఫిజియోథెరపీ కార్యక్రమాలపై శిక్షణ కార్యక్రమాన్ని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ప్రవీణ్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. వృద్ధుల ఆరోగ్యనికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి, సంరక్షణ, సహాయం ఆరోగ్య మౌలిక సదుపాయాల కల్పన, వారానికి ఒకసారి ప్రత్యేక క్లినిక్ వారి కోసం కండక్ట్ చేయాలని ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్ తెలిపారు. ఫిజియోథెరపీలో వ్యాయామాలు చేయించుట, కోల్డ్, హాట్ థెరపీ ద్వారా నొప్పిని, వాపుని తగ్గించవచ్చన్నారు. స్ట్రెస్ అనేది ఆలోచన ద్వారా వస్తుందని కోపం, నిరాశ వంటి భావోద్వేగాలు కలగకుండా యోగ, ధ్యానం వంటి పద్ధతులు పాటించాలని తెలిపారు. ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ బి.మేఘన, జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం టీం ఎస్.అనూష శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎం ఓ డాక్టర్ చక్రధర్‌రావు, నర్సింగ్ సూపరింటెండెంట్ జయప్రద, డివిజనల్ సూపర్‌వైజర్ జి.కమల్ శేషు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గణాంక శాస్త్ర దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ

రామచంద్రపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మ్యాథ్స్, కామర్స్ విభాగాల ఆధ్వర్యంలో జాతీయ గణాంక శాస్త్ర దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. భారత గణాంక శాస్త్ర పితామహుడు ప్రొఫెసర్ ప్రశాంత చంద్ర మహలానోబిస్ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రామకృష్ణ వెల్లడించారు.

ఈ కార్యక్రమాన్ని కళాశాల అధ్యపకులు టి.శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పీసీ మహలానోబిస్ చిత్రపటానికి పూల మాలలతో నివాళులు అర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ గణాంక శాస్త్రం అనేది ఒక సబ్జెక్టుగానే కాకుండా మన రోజు వారి జీవితంలో కూడా ఒక భాగమన్నారు. కామర్స్ విభాగం ఇన్‌చార్జి ఆర్.వెంకటేశ్వరులు గణాంకాల సామాజిక వాడకంపై ప్రసంగించారు. గణిత విభాగానికి ఇన్‌చార్జి వై. పద్మజ '75 సంవత్సరాల నేషనల్ సాంపుల్ సర్వే ఒక సమీక్ష' అనే ప్రధానాంశంపై ప్రసంగించారు. విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.